ong-5_ong-5.qxd 11/4/2026 11:04 PM Page 1

తుఫాను బాధితులకు ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుంది

- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు
- కొణిజేడు పునరావాస కేంద్రంలో కలెక్టర్, ప్రత్యేక అధికారి పర్యటన
- పునరావాస కేంద్రంలోని 20 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

ఒంగోలు, ప్రభాతవార్త

మురసు తుఫాను తీవ్ర ప్రభావంతో టంగుటూరు మండలం కొణిజేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా ప్రత్యేక అధికారి రంజిత్ బాషతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ సురక్షిత ఆశ్రయం పొందుతున్న 20 కుటుంబాలను వారు నేరుగా సందర్శించి, అందుతున్న వసతి, భోజన సౌకర్యాలు, వైద్య సేవలు మరియు తాగునీటి సరఫరా పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బాధితులకు భరోసా కల్పిస్తూ, ప్రభుత్వం తరఫున కేటాయించిన అత్యవసర సహాయక నిత్యావసర వస్తువుల ప్యాకేజీని పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఒక కిలో చక్కెర, ఒక లీటరు వంటనూనె, ఒక కిలో బంగాళాదుంపలు, ఒక కిలో కందిపప్పు, మరియు ఒక కిలో ఉల్లిగడ్డలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న కుటుంబాలతో కలెక్టర్ పి. రాజాబాబు చాలా ఆప్యాయంగా మాట్లాడారు. ఇల్లు,వాకిలి వదిలి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న బాధితుల్లో ధైర్యాన్ని నింపుతూ, "ప్రకృతి వైపరీత్యం వల్ల తాత్కాలికంగా నివాసాలు వదిలి రావాల్సి వచ్చినా, ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మీరు ఎలాంటి అధైర్యానికి గురికావలసిన అవసరం లేదని తుఫాను ప్రభావం తగ్గి, పరిసరాలు పూర్తి సాధారణ స్థితికి వచ్చేంత వరకు పునరావాస కేంద్రంలోనే మీకు నాణ్యమైన ఆహారం, శుభ్రమైన తాగునీరు, వేళకు వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంటాయన్నారు. కేంద్రం నుండి మీ ఇళ్లకు సురక్షితంగా చేరుకునే వరకు అన్ని విధాలా అండగా నిలుస్తాం" అని స్పష్టమైన హామీ ఇచ్చారు. అనంతరం కేంద్రం నిర్వహణపై అక్కడే ఉన్న అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని పద్మశ్రీ, టంగుటూరు మండల రెవెన్యూ అధికారి ఆంజనేయులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై వీక్షణ కార్యక్రమం

ఒంగోలు, ప్రభాతవార్త

బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునేత జిల్లా కలెక్టర్లతో ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎంపీటీసీ జడ్పీటిసి ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు సజావుగా జరిగిన నేపథ్యంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు కూడా సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా పరిషత్ బుక్కు కార్యనిర్వాహణ అధికారితో మాట్లాడుతూ ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గానికి ఒక స్పెషల్ డివ్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను నియమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనకుమారి, షణ్ముఖ కార్య నిర్వహణ అధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ బరి.. ఎవరికో గురి..

- నేడే పోలింగ్

ఒంగోలు, ప్రభాతవార్త

మండల, జిల్లా ప్రాదేశికాల ఎన్నికలు గురువారం ఉదయం 7గంటల నుంచి 5గంటల వరకు జరుగుతుంది. గురువారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో ప్రధాన పార్టీల నాయకులు తెరవెనుక వ్యూహాల అమలుపై దృష్టి సారించారు. ఓటర్ల తరలింపు, పోలింగ్ ఏజెంట్ల సన్నద్ధత, ఇతర ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరో వైపు అధికారులు బూత్‌ల వారీగా పోలింగ్ సామాగ్రిని ఇప్పటికే సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 27జడ్పీటీసీలు ఉండగా, మర్రిపూడి, పొన్నలూరు ఏకగ్రీవం కాగా, 25 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటి పరిధిలో 96మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. టీడీపీ నుంచి 22 మంది, వైసీపీ నుంచి 25మంది, బీఎస్పీ నుంచి ఐదుగురు, కాంగ్రెస్ నుంచి 5మంది, జనసేన నుంచి ముగ్గురు, సీపీఐ, సీపీఎం తరుపున ముగ్గురు చొప్పున, మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జిల్లాలో 371 ఎంపీటీసీ స్థానాలకు 151స్థానాలు ఏకగ్రీవం కాగా, 220స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఐదు మండలాల్లోని ఎంపీటీసీలు పూర్తిగా ఏకగ్రీవమయ్యారు. ఈ ఏకగ్రీవ స్థానాల్లో 143 మంది టీడీపీ, ఐదుగురు జనసేన, వైసీపీకి చెందిన ఇద్దరు, మరొకరు స్వతంత్ర అభ్యర్థి ఉన్నారు. మిగిలిన 220 ఎంపీటీసీ స్థానాలకు 559మంది పోటీల్లో ఉండగా, వైసీపీ నుంచి 211, టీడీపీ నుంచి 210 మంది, జనసేన నుంచి 20మంది, సీపీఎం నుంచి ఆరుగురు, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, బీఎస్పీ నుంచి ముగ్గురు, సీపీఐ, సీపీఎం నుంచి ఒకరేసి చొప్పున బరిలో ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నేడు పోలింగ్ జరగ్గా 7వ తేదీన ఓటర్ల లెక్కింపు, అదే రోజున ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఆ మేరకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింట్ ద్వారా వీక్షించేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు. పరిషత్ పోరులో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ, వైకాపా, సీపీఎం, సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. గత కొద్ది రోజులుగా అభ్యర్థులు వారి కుటుంబీకులు, బంధువులు, నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. విజయంపై ప్రధాన పార్టీల అభ్యర్థులు వారికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రధానాస్త్రాలు గా కూటమి నాయకులు ప్రచారం సాగించారు. తెలుగుదేశం జడ్పీ చైర్మన్ అభ్యర్థిగా ఎస్సీ రిజర్వుడ్ కావడంతో ఇంకా పేరు తెలుగుదేశం, వైకాపా నుంచి ప్రస్తుతానికి బయటకు రాలేదు.

ఫేస్ కళాశాలలో సోలార్‌ప్యానల్ ఇతర వస్తువులు ధ్వంసం

ఒంగోలు, ప్రభాతవార్త

ముసురు తుఫాన్‌తో ఒంగోలు నగర శివారులోని వల్లూరు ఫేస్ ఇంజనీరింగ్ కళాశాలలోని సోలార్ ప్యానెల్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. వీటి విలువ సుమారు 15 లక్షల నుండి 20 లక్షల నష్టం ఉంటుంది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శ్రీధర్ మాట్లాడుతూ కళాశాలలో ముసురు తుఫాను ప్రభావంతో మంగళవారం తీవ్ర గాలులు వర్షం వలన ఫేస్ కాలేజీ సోలార్ ప్యానెల్స్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమైయ్యాయన్నారు. వాటి ఖరీదు సుమారు 15 లక్షలు నుండి 20 లక్షలు ఉంటాయని శ్రీధర్ తెలిపారు. ఈదురు గాలులు అతివేగంతో రావడంతో సోలార్ పానెల్స్ తీవ్రంగా దెబ్బతిన్నాయని ఫేస్ కాలేజ్ కరస్పాండెంట్ శ్రీధర్ మీడియాకి తెలిపారు.

చీమకుర్తి ప్రజలకు ధన్యవాదాలు

- చైర్మన్ శిద్దా సుధాకర్

చీమకుర్తి, నవంబర్ 4, ప్రభాతవార్త

తమపై, తమ శిద్దా కుటుంబం పై నమ్మకం ఉంచి, మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ గా గెలిపించినందుకు చీమకుర్తి ప్రజలకు ధన్యవాదాలు చెబుతున్నట్టు శిద్దా సుధాకర్ ప్రకటించారు. మొత్తం28 వార్డులకు గాను కూటమికి తిరుగులేని మెజార్టీగా 23 వార్డులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని వారన్నారు. అదేవిధంగా 3,043 ఓట్ల మెజార్టీని తమ గెలుపు కోసం ప్రజలు ఇవ్వడాన్ని జీవితంలో మరిచిపోలేనని సుధాకర్ అన్నారు. చీమకుర్తి ప్రజల కోసం చీమకుర్తి ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తానని వారు వ్యక్తపరిచారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్, మాజీ మంత్రివర్యులు తమ బాబాయి శిద్దా రాఘవరావు, తనతో పాటు గెలిచిన వార్డు సభ్యులు అందరికీ, తమ కుటుంబ సభ్యులందరికీ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, చీమకుర్తి ప్రజలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు వెల్లడించారు.

ప్రకాశం వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

జనార్దన్‌ను కలిసిన ఇండిపెండెంట్ కార్పొరేటర్ అంకశాల రంగ

ఒంగోలు, ప్రభాతవార్త

ఒంగోలు నగరంలోని 35వ డివిజన్ ఇండిపెండెంట్ కార్పొరేటర్‌గా గెలుపొందిన అంకశాల రంగనాయకులు బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు నివాస గృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 35వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ, జనసేనతో పాటు వైసీపీ, పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీల్లో నిలవగా అంకశాల రంగనాయకులు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 233 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆయనను ఆహ్వానించారు. తాను బేషరతుగా తెలుగుదేశంకు మద్దతు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే జనార్దన్‌రావును పార్టీ కండువా కప్పి రంగను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఆరిగ చలమయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

- గ్రామీణ పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు
- తుఫాను కష్టాలను అధిగమిస్తూ సకల ఏర్పాట్లు చేసాం
- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు

ఒంగోలు, ప్రభాతవార్త

ప్రకాశం జిల్లాలో ముగిసిన పురపాలక ఎన్నికల లెక్కింపు విజయవంతంగా పూర్తయిందని, గురువారం జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవిలతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో పటిష్టమైన ఎలక్షన్ బందోబస్తు మరియు ఇటీవల వీచిన మురసు తుఫాను ప్రభావం సహాయక చర్యల వివరాలను కలెక్టర్ సమగ్రంగా వెల్లడించారు.

పురపాలక ఎన్నికల లెక్కింపు పూర్తి - విజేతల ప్రకటన

జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు చీమకుర్తి, అద్దంకి మున్సిపాలిటీలలో పోలింగ్ మరియు లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా ముగించి అభ్యర్థులను విజేతలుగా డిక్లేర్ చేశామని కలెక్టర్ వివరించారు. ఒంగోలులో వార్డుల సంఖ్య ఎక్కువగా ఉండటం మరియు తుఫాన్ ప్రభావం వల్ల లెక్కింపు కొంత ఆలస్యమైనప్పటికీ, ఈ రోజుతో ఈ ప్రక్రియ పూర్తిగా ముగిసిందని తెలిపారు.

గ్రామీణ పోలింగ్ - పటిష్ట ఏర్పాట్లు

పురపాలక సమరం ముగియడంతో ఇప్పుడు గ్రామీణ ఎన్నికలపై దృష్టి సారించామని, గురువారం ఉదయం నుంచే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమవుతుందని కలెక్టర్ ప్రకటించారు. ఏకగ్రీవమైన స్థానాలుపోను మిగిలిన అన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. పోలింగ్ నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశామని, ఇందుకోసం కేటాయించిన సిబ్బంది ఇప్పటికే మండల హెడ్‌క్వార్టర్స్ నుంచి పోలింగ్ సామగ్రి తీసుకొని తమ కేటాయించిన స్థానాలకు చేరుకున్నారని వెల్లడించారు. మైక్రో అబ్జర్వర్లు గురువారం ఉదయమే తమ బాధ్యతలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో లైవ్ స్ట్రీమింగ్ - అల్లరి మూకలపై కఠిన చర్యలు

పోలింగ్ స్టేషన్లలో సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ మరియు సాధారణ కేంద్రాలుగా వర్గీకరించి తగిన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వివరించారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం (లైవ్ స్ట్రీమింగ్) ఏర్పాటు చేశామని తెలిపారు. సాధారణ పోలింగ్ కేంద్రాల్లో కూడా ట్రిపుల్ ఐటీ విద్యార్థుల భాగస్వామ్యంతో లాప్‌టాప్‌లు, వెబ్ కెమెరాలు మరియు పెన్ డ్రైవ్‌ల ద్వారా డేటాను నిరంతరం ఫీడ్ చేయడం లేదా వీడియో గ్రాఫీ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు ప్రతి కేంద్రంలోనూ డేటా రికార్డింగ్ పక్కాగా జరుగుతుందని, జడ్పీ సీఈఓ ఈ ప్రక్రియ మొత్తాన్ని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, గ్రామీణ ప్రజలందరూ ఎలాంటి భయాందోళనలు లేకుండా సామరస్యంగా వచ్చి ఓటు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల వాతావరణాన్ని చెడగొట్టాలని చూసే అల్లరి మూకలు, మిస్‌క్రియెంట్స్‌పై చాలా తీవ్రమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

మురసు తుఫాను నష్టం - యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

మురసు తుఫాను ప్రభావంపై కలెక్టర్ మాట్లాడుతూ, ఈదురుగాలులు వీచడం వల్ల పంటల కంటే ఎక్కువగా చెట్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి పొరుగు రాష్ట్రం నుంచి అనుభవజ్ఞులైన విద్యుత్ కార్మికులను రప్పించి రంగంలోకి దించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా ముందుజాగ్రత్తగా జనరేటర్లు, ప్రత్యామ్నాయ దీపాలను ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. పైరు దెబ్బతినకుండా పొలాల్లో నిలిచిన నీటిని వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో రైతులు వెంటనే కాలువల ద్వారా డ్రైన్ అవుట్ చేయడంతో పంట భద్రంగా ఉందన్నారు.

రిలీఫ్ క్యాంప్‌లు - నిరాశ్రయులకు పరిహారం, నిత్యావసరాలు

తుఫాను ప్రమాదాన్ని ముందే ఊహించి బాధితులను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించడం వల్ల భారీ ప్రాణనష్టం తప్పిందని పేర్కొన్నారు. రిలీఫ్ క్యాంప్‌లలో ఉన్న ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులైన వంటనూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ఇళ్ల నష్టానికి సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ చేపడుతున్నారని, పూర్తి నివేదిక రాగానే బాధితులకు తగిన నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. ప్రకృతి విపత్తును ఎదుర్కొంటూనే, ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను దిగ్విజయంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అంతా శ్రమిస్తోందని, ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనాలని కలెక్టర్ పి.రాజాబాబు కోరారు.

కూటమికే 'పుర'అభిషేకం

- మేయర్, చైర్మన్ స్థానాల్లో విజయదుందుభి
- వార్డు, డివిజన్లలో టీడీపీ ప్రభంజనం
- ఒంగోలు మేయర్‌గా నల్లమల్లి శ్రీశిల్ప

ఒంగోలు, ప్రభాతవార్త

ఒంగోలు కార్పొరేషన్ మేయర్‌గా తెలుగుదేశం అభ్యర్థి నల్లమల్లి శ్రీశిల్ప విజయం సాధించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా శ్రీశిల్ప ఒంగోలు మేయర్ అభ్యర్థిగా గెలుపొందినట్లు డిక్లరేషన్ పత్రం అందుకున్నారు. వైకాపా అభ్యర్థి కుప్పం ప్రసాద్‌పై 37,172 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఒంగోలు నగరపాలక సంస్థలో 62డివిజన్లు ఉండగా తెలుగుదేశం పార్టీకే 39డివిజన్లు, వైఎస్సార్‌సీపీకి 11, జనసేనకు 8, బీజేపీకి 1, ఇండిపెండెంట్‌లు 3 స్థానాల్లో విజయం సాధించారు. ప్రకాశం జిల్లాలో చీమకుర్తి, అద్దంకి స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. అభివృద్ధి మంత్రం ఫలించింది. సంక్షేమం కలిసొచ్చింది.

ప్రజాకాంక్ష అండగా నిలిచింది. పట్టణ పోరులో కూటమి ఓట్ల సునామి సృష్టించింది. లెక్కింపు ప్రారంభమైన ప్పట్నించే ప్రత్యర్థుల కోటలు ఒక్కొక్కటిగా కుప్పకూలగా ఫలితాలు వెలువడే సరికి పురతీర్పు ఏకపక్షమై నిలిచింది. జిల్లాలోని రెండు పట్టణాల్లోనూ వైకాపా తుడిచిపెట్టుకుపోగా, తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులు గెలుపు బాట పట్టారు. ఒంగోలు మేయర్‌తో పాటు అద్దంకి, చీమకుర్తి చైర్మన్ స్థానాల్లో విజయదుందుభి మోగించారు. డివిజన్ వార్డుల్లోనూ ఎదురేలేదు. ప్రజల పురాభిషేకంతో తిరుగులేని విజయాన్ని సాధించారు. ఒంగోలు కార్పొరేషన్‌లో తెలుగుదేశం అభ్యర్థిని నల్లమల్లి శ్రీశిల్ప ఘన విజయం సాధించారు. వైకాపా అభ్యర్థి కుప్పం ప్రసాద్‌పై 37వేల పైచిలుకు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల ముందు వరకు ఈమె పెద్దగా నగర వాసులకు పరిచయం లేదు. అధిష్టానం అనూహ్యంగా పేరును ప్రకటించడం తో తెరపైకి వచ్చారు. భర్త నల్లమల్లి బాలు 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ

కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుకు దృష్టిలో పట్టాడు. దీంతో విజయం సులువుగా దక్కింది. శ్రీశిల్ప అభ్యర్థిత్వాన్ని మొదట్నించి కొందరు వ్యతిరేకించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాత్రం నమ్మకం ఉంచారు. అన్ని తానై వ్యవహరించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. దీంతో ఎన్నికల్లో విజయం సాధించిన వైకాపా ఈసారి ఓటర్ల దెబ్బకు 11డివిజన్లకే పరిమితమైంది. నల్లమల్లి బాలు కుటుంబం నగర వాసులకు సుపరిచితమే. గతంలో వీరు వైకాపాలో ఉండేవారు. 2024కు ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు విజయానికి కృషి చేశారు. అనంతరం విజయవాడలో నగలవ్యాపారం చేసుకుంటుండేవారు. అనూహ్యంగా ఒంగోలు మేయర్ అభ్యర్థి అభ్యర్థిగా శ్రీశిల్పను అధిష్టానం ప్రకటించడంతో వారు పోటీకి సిద్ధమైనట్లు తెలిసింది. ఓసీ జనరల్‌కు రిజర్వు చేయడంతో నల్లమల్లి శ్రీశిల్పకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా నల్లమల్లి శ్రీశిల్ప విలేకర్లతో మాట్లాడుతూ నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సహకారంతో తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుకు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ ఆశయాలు, ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్తామని ఆమె పేర్కొన్నారు.

ఒంగోలులో భారీ దోపిడి.. 2కేజీల బంగారంతో ఉడాయింపు

ఒంగోలు, ప్రభాతవార్త

ఒంగోలులో బుధవారం ఉదయం భారీ దోపిడి జరిగింది. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి ఒంగోలులోని నగర దుకాణాలకు బంగారం తీసుకెళ్తున్న వ్యాపారులను కొందరు వ్యక్తులు మార్గమధ్యంలో అపహరించి దోపిడికి పాల్పడ్డారు. ఒంగోలు రైల్వే స్టేషన్‌లో దిగి ఆటోలో వెళ్తున్న వ్యాపారులను స్థానిక ఉపాస్ ఆసుపత్రి సమీపంలో కారును అడ్డం పెట్టి అటకాయించారు. వ్యాపారులను బలవంతంగా ఆటో నుంచి బయటకు లాగి తమ కారులో ఎక్కించుకుని దక్షిణ బైపాస్ సమీపంలోని డీ6ఎస్సీ టికా ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ వారిపై దాడి చేసి సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను దోచుకొని ఉడాయించారు. ప్రాణాలతో భయట పడిన వ్యాపారులు గాంధీ రోడ్డుకు చేరుకుని దోపిడి జరిగిన విషయాన్ని స్థానిక బంగారు వ్యాపారులకు తెలియజేశారు. వారి సహకారంతో రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ వీరనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. కోయంబత్తూరుకు చెందిన బంగారు వ్యాపారులైన ఆర్డీ బాలాజీ, ఆయన కుమారుడు రత్నచరణ్, కోయంబత్తూరులో శబరి ట్రైన్‌లో ఒంగోలు రైల్వే స్టేషన్‌కు బుధవారం ఉదయం చేరుకున్నారు. ఆటోలో గాంధీ రోడ్డుకు వెళ్తుండగా వారిని అనుసరించి ఉపాస్ హాస్పిటల్ వద్ద ఒన్నోవా కారులో వచ్చిన ఏడు మంది దుండగులు వారిని కారులో ఎక్కించుకుని డీసిక్స్ ఎస్సీటికాకు తీసుకెళ్లి కొట్టి బంగారు ఆభరణాల బ్యాగ్‌ను తీసుకెళ్లినట్లు సమాచారం. బంగారు ఆభరణాలు రెండు కేజీల వరకు ఉండవచ్చని అంచనా. వీరిరువురు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

చీమకుర్తి మున్సిపాలిటీపై శిద్దా జెండా

- గెలుపులో శిద్దా రాఘవరావు పాత్ర కీలకం
- సోదరుడు సుధాకర్ గెలుపుకోసం వాడవాడల ప్రచారం

చీమకుర్తి, ప్రభాతవార్త

చీమకుర్తి మున్సిపల్ ఎన్నికలలో తమ సోదరుని కుమారుడు సుధాకర్ గెలుపులో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తమదైన ముద్ర వేశారు. తానే పోటీ చేసినట్టుగా రంగంలోకి దిగి, ప్రచారంలో దూసుకుపోయారు. ఒకవైపు సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్‌ను సమన్వయం చేసుకుంటూ, తెలుగుదేశం శ్రేణులను ఉత్సాహపరుస్తూ కథనరంగంలోకి దిగారు. తమ జన్మభూమి అయిన చీమకుర్తిలో తొలిసారిగా స్థానిక ఎన్నికలలో శిద్దా కుటుంబం పోటీచేసి భారీమెజార్టీతో చైర్మన్ పదవిని చేజిక్కించుకుంది. దీనిలో శిద్దా కుటుంబం దిక్సూచిగా, తెలుగుదేశం పార్టీకి శాసనసభ్యులు బిఎన్‌తో కలిసి రథసారథిగా శిద్దా రాఘవ రావు వ్యవహరించారు. తాను పుట్టి పెరిగిన చీమకుర్తిలో వాడవాడ లా కలియ తిరుగుతూ, కలిసి చదువుకున్న వారిని పలకరించారు. తమ వద్ద పనిచేస్తున్న కార్మికుల కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకుంటూ తమ కుమారుడు శిద్దా సుధాకర్ గెలుపు కోసం వ్యూహాత్మకంగా పనిచేశారు. రాష్ట్ర మంత్రిగా శిద్దా రాఘవరావు చీమకుర్తిలో చేపట్టిన అభివృద్ధి పనులు సుధాకర్ ను చైర్మన్ గా 3,043 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించడానికి దోహదపడ్డాయి. సుమారు 11 కోట్ల రూపాయలతో మంజూరు చేయించి నిర్మించిన బైపాస్ రోడ్డు, మరో 10 కోట్ల రూపాయలతో నిర్మించిన గంగవరం రోడ్డు, నాయుడుపాలెం రోడ్లు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ సందర్భంగా రామ్ నగర్, వడ్డెర కాలనీ, ఇస్లాంపేట, అంబేద్కర్ నగర్, క్రిస్టియన్ పాలెం లకు వెళ్లి అక్కడ ప్రజలకు భరోసాగా నిలిచారు దీంతో చీమకుర్తి ప్రజలు ఈ ఎన్నికలలో సిద్ధ కుటుంబానికి జేజేలు పలికారు. వారి సోదరులు పాండురంగారావు, సోదరుని కుమారులు సూర్య ప్రకాష్ రావు, హనుమంతరావు, సురేష్, బాలాజీ, కాశీ విశ్వేశ్వరరావు, భరత్ తో పాటుగా ఆర్యవైశ్య సమాజం కూడా బలంగా సుధాకర్ కు గెలుపుకు కృషి చేశారు.

6:6.qxd 11/4/2026 11:59 PM Page 1

500 మందికి పైగా తుఫాన్ బాధితులకు ఆహార పంపిణీ

- ఇళ్లను కోల్పోయిన పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

- తుఫాన్ బాధితులకు ఆవుల అశోక్ కుమార్ ఆపన్నహస్తం

చీరాల, నవంబర్ 4, ప్రభాతవార్త

మురను తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన పేద కుటుంబాలకు ఆవుల అశోక్ కుమార్ అండగా నిలిచారు. చీరాల నియోజక వర్గంలోని వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో తుఫాన్ బీభత్సానికి అనేక పేద కుటుంబాల రేకుల ఇళ్లు, పూరి గుడిసెలు నేలమట్టమై నిలువ నీడ కోల్పోయిన పరిస్థితిని తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించారు. తన వంతు సాయంగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బాధితులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానని, రానున్న రోజుల్లోనూ వారికి అండగా ఉంటూ అవసరమైన సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. మరోవైపు తుఫాన్ కారణంగా గ్రామంలోని ప్రధాన రహదారులతో పాటు చిన్న చిన్న కూడళ్లలో భారీ వృక్షాలు విరిగిపడి పడటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసరంగా ఆసుపత్రులకు వెళ్లాల్సిన వారు సైతం రహదారులు మూసుకుపోవడంతో అవస్థలు పడ్డారు. ఈ పరిస్థితిని గుర్తించిన ఆవుల అశోక్ కుమార్ ప్రొక్లెయినర్లను ఏర్పాటు చేయించి రహదారులపై పడిన భారీ వృక్షాలతో పాటు ఇతర ప్రాంతాల్లో విరిగిపడిన చెట్లను తొలగించేలా చర్యలు చేపట్టారు. అంతే కాకుండా తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన కాలనీవాసులు, ఇతర బాధిత కుటుంబాలకు కలిపి 500 మందికి పైగా ఆహారాన్ని పంపిణీ చేశారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆహారం, రహదారుల పునరుద్ధరణకు సహకరించిన ఆవుల అశోక్ కుమార్ సేవలను గ్రామ ప్రజలు అభినందించారు.

పామూరు జెడ్పీటిసి ఎన్నికల్లో ఓటు వేయనున్న ప్రేతాత్మలు

- ఓటర్ స్లిప్పులు పంచలేదని ఆత్మల ఘోష

పామూరు, నవంబర్4, ప్రభాతవార్త

పామూరు మండల జడ్పిటిసి ఎన్నికలు గురువారం నాడు జరగనున్న నేపథ్యంలో ఓటర్ స్లిప్పుల కోసం ఆత్మలు ఘోషిస్తున్నాయి. మరి కొన్ని గంటల్లో ఓటింగ్ ప్రక్రియప్రారంభం కావలసి ఉన్నప్పటికీ ఓటర్ లిస్టులో తమ పేర్లు ఫోటోలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఓటర్ స్లిప్పులు ఇవ్వలేదని ఆత్మలు పరితపిస్తున్నాయి. ఒక పక్క సర్ ప్రక్రియతో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంట ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నప్పటికీ ఎలక్షన్ అధికారులు మాత్రం ఎప్పుడో చనిపోయినవారి ఓట్లను తొలగించకపోవటం విశేషం. ఓటర్ల చేర్పులు మార్పులు ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నప్పటికీ బాధ్యత గల బిఎల్వోలు, రెవెన్యూ అధికారులు చనిపోయిన వారి ఓట్లు తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వైనంపై అధికారులు పనితీరును పలువురు విమర్శిస్తున్నారు. పామూరు పంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డుకు సంబంధించిన దాదాపు 100 ఓట్ల వరకు మరణించిన వారి ఫోటోలు సహా లిస్ట్ లో ఉండటం ఆశ్చర్యకరం. పోటీలో నిలిచిన అభ్యర్థులు వారి ఓట్లను ఏ విధంగా తెప్పించుకొని పోల్ చేపిస్తారని పలువురు విమర్శిస్తున్నారు. వికలాంగులకు వయోవృద్ధులకు విభిన్న ప్రతిభావంతులకు అభ్యర్థులు వివిధ వాహనాలు ద్వారా వారు ఇళ్ళకు వద్ద నుంచి పోలింగ్ బూత్ వరకు తీసుకుని వచ్చి ఓటింగ్ చేపించుకోవడం ఆనవాయితీ.. కానీ మరణించి ప్రేతాత్మలుగా ఉన్న వారికి ఏ వాహనాన్ని పంపించి పోలీస్ బూత్‌కు తీసుకు వస్తారని పలువురు అంటున్నారు. ఒకవేళ ప్రేతాత్మల ఓట్లు వేరే ఎవరైనా వేస్తే ఆత్మలు పరితపిస్తాయని జనాలు వ్యంగ్యంగా అంటున్నారు. పామూరు పంచాయతీ పరిధిలో 1200 నుండి 1500 వరకు మరణించిన వారి ఓట్లు ఇంకనూ కొనసాగుతున్నట్లు తెలుస్తుంది మండలంలోని 56000 ఓట్లలో మూడు నుండి నాలుగు వేల వరకు మృతి చెందినవారు. ఈ ప్రాంతంలో లేనివారితో పాటు మండలంలోనే రెండు మూడు ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నట్టు తెలుస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రేతాత్మ ఓట్లను ఓటర్ లిస్ట్ నుండి తొలగించి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని పామూరు మండల ప్రజలు కోరుతున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే కేసులు

- సీల్ వేసిన మద్యం దుకాణాల్లో తనిఖీలు

సింగరాయకొండ, నవంబర్ 4, ప్రభాతవార్త

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో డ్రై డే నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఒంగోలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయేషా బేగం హెచ్చరించారు. బుధవారం సింగరాయకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీల్ వేసిన ఏ 4 మద్యం దుకాణాలను ఆమె సింగరాయకొండ ఎక్సైజ్ సీఐ ఎం. శివకుమారితో కలిసి తనిఖీ చేశారు. ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నా తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు మద్యం దుకాణాలు తెరవకూడదని స్పష్టం చేశారు. వారి వెంట ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి

- ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్

పొన్నూరు, నవంబరు 3,ప్రభాతవార్త

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ పిలుపునిచ్చారు. పొన్నూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కొంత మంది ఆర్యవైశ్య సోదరులు నిడుబ్రోలు రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలు ప్రయాణికులకు బిర్యాని, బిస్కట్లు, పండ్లు తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి ప్రకాష్ మాట్లాడుతూ మురసు తుఫాను కారణంగా సికింద్రాబాదు నుండి తిరుపతి వెళ్ళాల్సిన పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలును నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో అర్ధాంతరంగా నిలిపివేశారు. నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో విషయం తెలుసుకున్న వాసవిక్లబ్ స్పందించి, ఆర్యవైశ్య సోదరులను కలుపుకొని తలా కొంత నగదుతో ప్రయాణికుల ఆకలిని తీర్చేందుకు వెటిటబుల్ బిర్యాని, వాటర్ బాటిల్స్,బిస్కట్ ప్యాకెట్లు, టీ పంపిణీ చేశారు. విషయం తెలుసుకొని స్పందించిన వాసవిక్లబ్,కిరాణా మర్చంట్స్ అసోసియేషన్,లక్ష్మీ వెంకటేశ్వర చిట్స్,ఆర్యవైశ్య సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసమూర్తి,ఆకికిషోర్,గాదంశెట్టి సతీష్,అన్నవరపు నాగవెంకటకృష్ణారావు,సౌజన్య టైపు ఇనిస్టిట్యూట్ అధినేత సంకా విజయప్రసాద్, ధనుంజయ, ఆనంద్, సత్యం, గోద్రేజ్ శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్

- 66 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి.. సిబ్బందికి సామగ్రి పంపిణీ

సింగరాయకొండ, నవంబర్ 4, ప్రభాతవార్త

మండలంలో జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్వో సీహెచ్. సువార్త ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని పది గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన 66 పోలింగ్ కేంద్రాలకుసిబ్బంది తమకు కేటాయించిన సామగ్రితో చేరుకున్నారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, పేపర్స్, ఓటర్ల జాబితాలు, బ్యాలెట్ బాక్సుల భద్రతకు అవసరమైన సీల్స్ తదితర సామగ్రిని అందజేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద భద్రత కోసం పోలీసు సిబ్బందిని నియమించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో డి. వెంకట్రావు,మాస్టర్ ట్రైనర్ అరిబోయిన రాంబాబు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

చీరాల, నవంబర్ 4, ప్రభాతవార్త

చీరాల మండలంలోని తోటవారిపాలెం, చీరాల నగర్ గ్రామాలలో లాంఫాం నుంచి డాక్టర్ కే.సుజాత, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ పి.కిషోర్ వర్మలతో కూడిన శాస్త్రవేత్తల బృందం పర్యటించారు. కార్యక్రమంలో వారు వేరుశనగ,మిరప, వరి పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ వరిలో యూరియా, పొటాష్ 25 కేజీలు చొప్పున ఎకరాకు వేయాలని సూచించారు. పాము పొడ, మొదలు కుళ్ళు తెగుళ్ళను నివారించడానికి హెక్సా కొనజోల్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి లేదా ప్రాపికొనజోల్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వేరుశనగ పంటలో ఎకరాకు 200 కేజీల జిప్సంను అధిక దిగుబడి పొందాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.నిర్మలాదేవి, ఏఈఓ గీత, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీగిరిలో సుదర్శన హోమం...

- 2027 నూతన సంవత్సర స్వామి డైరీలు క్యాలెండర్లు ఆవిష్కరణ..

- శ్రీ గిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావుకు ఘనంగా నివాళులు

ఒంగోలు కల్చరల్,నవంబర్ 4,ప్రభాతవార్త

ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం సుదర్శన హోమాన్ని ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు జయంతిని పురస్కరించుకుని శ్రీ గిరిలోని రమణారావు కాంస్య విగ్రహానికి అభిషేకం నిర్వహించారు.రమణారావు కుటుంబ సభ్యులు,శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ ఆలూరు జై శంకర్ ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్యనిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి ఆలూరు కుమార ఆత్తేయ ఆలూరు ఫణి కుమార్ ధర్మకర్తల మండలి ప్రతినిధులు శ్రేయోభిలాషులు కార్యక్రమంలో పాల్గొని ఆలూరు వెంకటరమణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాతగా వ్యవస్థాపక ధర్మకర్తగా ఆలూరు వెంకటరమణారావు చేసిన కృషిని సమాజానికి అందించిన విద్యా వైద్య సేవలను వక్తలు శ్లాఘించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన 2027 నూతన సంవత్సరం డైరీలు క్యాలెండర్లు శ్రీగిరి దేవస్థానం చెంతనే ఉన్న శ్రీగిరిగో క్షేత్రంలో భక్తులకు అందుబాటులోఉన్నాయని పేర్కొన్నారు. డైరీలు క్యాలెండర్లు పరిమిత సంఖ్యలో ఉన్నందున ఒక్కొక్కరికి ఒక్కొక్క డైరీ క్యాలెండర్ మాత్రమే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొదిలి పోరులో మైండ్ గేమ్‌లు

- పోలింగ్ ముంగిట వైఎస్సార్‌సీపీకి భారీ షాక్ - ప్రత్యక్ష కదనరంగం నుంచి జెడ్పీటీసీ అభ్యర్థి ఆకస్మిక విత్‌డ్రా

- సోషల్ మీడియాలో సెన్సేషనల్ వీడియో - కకావికలమైన స్థానిక క్యాడర్

- భారీ ప్యాకేజీ సెటిల్మెంటా.. లేక అధికార పీఠం నుంచి ఒత్తిళ్లా - మండిపడుతున్న శ్రేణులు

- విజయ పీఠంపై ప్రత్యర్థులను కూర్చోబెట్టడానికే ఈ డ్రామా - స్థానిక నాయకత్వ వైఫల్యంపై బేతాళ ప్రశ్నలు

పొదిలి, నవంబర్4, ప్రభాతవార్త

ఎన్నికల కదనరంగంలో చివరి ఘడియల వరకు హోరాహోరీగా సాగిన ప్రచారం.. గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమించిన సైన్యం.. తీరా పోలింగ్ ముంగిట ఓటు వేసేందుకు ప్రజాబాహుళ్యం సిద్ధమవుతున్న వేళ పొదిలి మండల రాజకీయాల్లో మైండ్ బ్లాకింగ్ పరిణామం చోటుచేసుకుంది. స్థానిక జెడ్పీటీసీ రేసులో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుజ్జుల సంజీవరెడ్డి చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఒక వీడియో క్లిప్ ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో పెను తుఫాను సృష్టించింది. నామినేషన్ల ఘట్టం పూర్తయి, ప్రచార పర్వం ముగిసి, రేపే ఎన్నికల పోలింగ్ అనగా శత్రువు ముందు ఆయుధాలు పడేసి వెనకడుగు వేయడాన్ని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎంతమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదికేవలం పోటీ నుంచి తప్పుకోవడం కాదని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం రక్తం దారపోసిన కార్యకర్తల వీపున వెన్నుపోటు పొడవడమేనని శ్రేణులు రగిలిపోతున్నాయి. అభ్యర్థి తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక లోతైన రాజకీయ కుట్రలు,రహస్య ఒప్పందాలు ఉన్నాయనే వార్తలు మండలంలో దావానలంలా వ్యాపిస్తున్నాయి. ప్రత్యర్థుల నుంచి అందిన భారీ ప్యాకేజీకి ఆశపడే అభ్యర్థి ఇలా చివరి నిమిషంలో మైదానం ఖాళీ చేశారా అని కార్యకర్తలు బహిరంగంగానే నిలదీస్తున్నారు. అధికార పక్షం నుంచి వచ్చిన బెదిరింపులు, ఒత్తిళ్లకు తలొగ్గి తోక ముడిచారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్ద కాలంగా పార్టీ జెండాను భుజాన మోసిన శ్రేణుల భవిష్యత్తును వ్యక్తిగత ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టడం ఏ రకమైన నాయకత్వమని నాయకులు మండిపడుతున్నారు. యుద్ధరంగంలోకి దిగిన తర్వాత విజయమో వీర స్వర్గమో అనాలి తప్ప ప్రత్యర్థులను ముందు మోకరిల్లడం ద్రోహం కాక మరేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ ఊహించని పరిణామంతో ప్రత్యర్థి విజయానికి నేరుగా రాజమార్గం సుగమం చేసినట్లు అయిందని స్థానిక శ్రేణులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెలుపుపీఠంపై ప్రత్యర్థులను ఊరికే కూర్చోబెట్టడానికే ఈ నాటకమంతా ఆడారని విమర్శిస్తున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలవాల్సిన అభ్యర్థి ఇలా పారిపోతే, రేపు వీధి పోరాటాల్లో తమకు రక్షణ లేదని కార్యకర్తలు వాపోతున్నారు. మరోవైపు ఈ భంగపాటుకు స్థానిక నియోజకవర్గ నాయకత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ ఊపొందుకుంది. అభ్యర్థి వ్యక్తిత్వాన్ని, నిబద్ధతను సరిగ్గా అంచనా వేయకుండా టికెట్ కేటాయించడంలో స్థానిక పెద్దలు ఘోరంగా విఫలమయ్యారని గళమెత్తుతున్నారు. శ్రేణుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన ఈ పరిణామంపై పార్టీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకొని బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పొదిలి మండల వైయస్సార్సీపి కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

7:7.qxd 11/4/2026 11:58 PM Page 1

పరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం

- వెలుగు అడిషనల్ డైరెక్టర్ పోలయ్య

త్రిపురాంతకం, నవంబర్ 4, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బ్రహ్మంగారి కాలనీ నందు బుధవారం పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెలుగు అడిషనల్ డైరెక్టర్ పోలయ్య మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే మొదటిగా మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు.అలా ఉంటేనే అంటు రోగాలు ప్రబలకుండా ఉంటాయని అందువల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ బాలయ్య, ఏపీఎం ఎడ్వర్డ్, సిసి ఆంజనేయులు, వివోఏలు, ఇతర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 291 పోలింగ్ కేంద్రాలు

- కనిగిరి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కల్లి శ్రీనివాసరెడ్డి

కనిగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త

కనిగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరుమండలాల్లో గురువారం జరగనున్న జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కనిగిరి డివిజనల్ డెవలప్ మెంట్ ఆఫీసర్‌కల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆరు జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి 75 ఎంపీటీసీ ప్రాదేశికాల పరిధిలో మొత్తం 291 పోలింగ్ కేంద్రాలనుఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేట రోడ్డులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం ఆయన ఆయా కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, భద్రత, కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలాల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను ఆయన వెల్లడించారు. కనిగిరి మండలంలో 54, హనుమంతునిపాడు మండలంలో 33, వెలిగండ్ల మండలంలో 40, సీఎస్‌పురం మండలంలో 47, పామూరు మండలంలో 75, పీసీపల్లి మండలంలో 42 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 291 కేంద్రాల్లో గురువారం పోలింగ్ నిర్వహించనున్నట్లు డీడీఓ కల్లి శ్రీనివాసరెడ్డి వివరించారు.

పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామాగ్రిని తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

- జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం

సీఎస్‌పురం, నవంబర్4, ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జడ్పిటిసి ఎన్నికలు నిర్వహించేందుకు మండలంలో రంగం సిద్ధం చేశారు. మండలంలో ప్రధాన పార్టీలైన సిపిఎం, టిడిపి, వైసిపి పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు మరో 7మంది స్వతంత్ర అభ్యర్థులు జడ్పిటిసి బరిలో ఉన్నారు. మండలంలో 47పోలింగ్ బూత్‌లు ఉండగా పోలింగ్ నిర్వహణ కోసం 54మంది పిఓలు, 54 మంది ఏపీఓలు, 150 మంది ఓపిఓలను ఏర్పాటు చేశారు.ఆ మేరకు ఎన్నికల ఆర్ఓ కె శ్రీనివాసరావు, ఏఆర్ఓలు కే.ధర్మతేజ, ఎంకె చక్రపాణి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలింగ్ సిబ్బందికి పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు తదితర సామాగ్రిని అందజేశారు. డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, ఎంఈఓ జే ప్రసాదరావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో 17,628 మంది పురుషులు, 27,061 స్త్రీలు, ఇతరులు 1 మొత్తం 34,690 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

సుశీలమ్మ అకాలమరణం బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

సీఎస్‌పురం, నవంబర్4, ప్రభాతవార్త

శీలంవారిపల్లి గ్రామానికి చెందిన ఇరగని చిన్న మాకలకొండలయ్య సతీమణి సుశీలమ్మ అకాలమరణం బాధాకరం అని కనిగిరి మాజీ ఎమ్మెల్యే,విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. సుశీలమ్మ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కదిరి బాబురావు బుధవారం మాలకొండయ్య నివాస గృహానికి పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాశ్‌రావు, ఇరగని చలపతిరావు, మూరం కాశిరెడ్డి, షేక్ బుజ్జి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, కొట్టే శ్రీను, మామిడాల కిషోర్, టి.లక్ష్మీనారాయణ, ఇరగని మాధవరావు, తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- కనిగిరి డీఎస్పీ శ్రీనివాసరావు

కొనకనమిట్ల, నవంబర్4, ప్రభాతవార్త

మండలంలో గురువారం జరిగే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల పోలింగ్‌కు 45మంది, పోలీసులు, ప్రత్యేక పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కనిగిరి డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులుగా ఉండటం, అల్లరులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వెళ్లేవారు అగ్గిపెట్టెలు, వాటర్ బాటిల్స్ తీసుకొని వెళ్ళరాదన్నారు. ఎన్నికల విధులకు వెళ్లే పోలీస్ సిబ్బందికి వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్.రాజేష్ కుమార్, ఎస్సై బి.శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

270 మందిపై బైండోవర్ కేసులు :

జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా టిడిపి, వైసిపికి చెందిన చెందిన 270మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎన్నికలకు సర్వం సన్నద్ధం

కురిచేడు, నవంబర్ 4, ప్రభాతవార్త

నేడు మండలంలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి రాజు తెలిపారు. బుధవారం నాడు స్థానిక మార్కెట్ యార్డులో పోలింగ్ కేంద్రాలకు తరలించాల్సిన సామాగ్రిని సంబంధిత అధికారులకు పంపిణీ చేశారు. ఎన్నికలను నిష్పక్షికంగా నిర్వహించాలని ఏదైనా సమస్య తలెత్తినట్లయితే తమను సంప్రదించాలని తెలిపారు. కాగా మండలంలో 12 ఎంపీటీసీ సెగ్మెంట్లు ఉండగా 11 కూటమికి ఏకగ్రీవమయ్యాయి. ఒక నమశివాయపురం ఎంపీటీసీ సెగ్మెంట్‌కు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానం కూటమి జనసేనకు కేటాయించింది. జడ్పీటీసీ బరిలో టీడీపీ, వైకాపా, ఒక స్వతంత్ర అభ్యర్థి బరిలో ఉన్నారు. అధికార పార్టీ యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో మునిగితేలుతుండగా కార్యకర్తలు ప్రతిపక్షమైన వైకాపాలో అంత ఉత్సాహం లేక ప్రచారం మాత్రం మందకొడిగా సాగింది. మొత్తం మీద గురువారం నాడు ఎన్నికలలో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. శాంతి భద్రతల్లో కాపాడేందుకు , ప్రశాంత వాతావరణంలో ఎవరి ఓటును వారు వినియోగించుకోవాలని మండల ప్రజలకు సూచించారు.

మార్కాపురం వార్త

తుఫాను బాధితులకు అండగా ఉంటాం

- బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల, నవంబర్ 4, ప్రభాతవార్త

మురసు తుఫాను ప్రభావానికి గురైన నియోజకవర్గ పరిధిలోని ఓడరేవు తీరప్రాంతాన్ని లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల శాసనసభ్యులు ఎంఎం.కొండయ్యతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా తుఫాను ధాటికి దెబ్బతిన్న బోట్లు,మత్స్యకారుల వలలు,అధికారులతో కలిసి వారు స్వయంగా పరిశీలించారు.నష్టపోయిన బాధితులు,మత్స్యకారులు మరియు స్థానికప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాను బాధితులకు అండగా ఉంటాం అని హామీ ఇచ్చారు.

పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టరు విజయ సునీత

యర్రగొండపాలెం, నవంబర్ 4, ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా జడ్పిటీసీ యంపిటీసీల ఎన్నికలు జరుగనున్నాయి. యర్రగొండపాలెం మండలంలో యంటిసిలు 18 కి 18 ఏకగ్రీవం కావడంతో ఒక్క జడ్పిటిసి ఎన్నికలు మాత్రమే జరగనున్న నేపథ్యంలో జడ్పీటిసి ఎన్నికల విధులకు సిబ్బంది హాజరయ్యారు. ఈనెల ఐదున అంటే గురువారం పోలింగ్ జరుగనున్న విషయం తెలిసిందే. ఎన్నికల నిర్వహణకు స్థానిక అబెండ్కర్ ఆడిటోరియంలో మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియను జిల్లాకలెక్టరు విజయ సునీత పరిశీలించారు.పోలింగ్ సమయంలో చేపట్టాల్సిన విధివిధానాల గురించి సూచించారు. బుదవారం ఉదయం ఏడు గంటల నుంచి సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ఫెసిలిటేషన్ సెంటర్ నుంచి అధికారులు ఎన్నికల విధులకు వచ్చిన సిబ్బంది వివరాలను మైక్ ద్వారా అనౌన్స్ చేస్తూ హాజరు నమోదు చేసుకున్నారు.పోలింగ్ స్టేషన్లో వారీగా మెటీరియల్‌ను పంపిణీ సిద్ధం చేశారు. మెటీరియల్ స్వాధీనం చేసుకున్న ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొసైడింగ్ ఆఫీసర్స్,ఆదర్ పోలింగ్ ఆఫీసర్స్ మెటీరియల్ను సరి చూసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నంకి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సులలో పోలింగ్ స్టేషన్లకు సిబ్బందిని చేరుస్తారు.ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బాలునాయక్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బండారు శ్రీనివాసులు తహశీల్దారు ఎన్.జయలక్ష్మీలతో పాటు రూట్ ఆఫీసర్లు, జోనర్ అధికారులు మెటీరియల్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.

నేడు పరిషత్ పోరు...

పొదిలి మండలంలో ఏర్పాట్లు పూర్తి

- నేడే పోలింగ్.. ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్

- 32 పోలింగ్ బూత్‌లు.. 64 బ్యాలెట్ బాక్సులు సిద్ధం

- రంగంలో 160 మంది ఎన్నికల సిబ్బంది

- రెండు ఎంపీటీసీ స్థానాలకు, మండలం అంతటా జడ్పిటిసి స్థానానికి ఎన్నికలు

పొదిలి, నవంబర్4, ప్రభాతవార్త

పొదిలి మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. మండల పరిషత్ కార్యాలయం నుండి ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ పూర్తి చేసి, సిబ్బందికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు వాహన రవాణా ఏర్పాట్లను అధికారులు సమర్థవంతంగా పూర్తి చేశారు.పొదిలి మండలం వ్యాప్తంగా మొత్తం 22,741 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు 32 పోలింగ్ బూత్‌లు,64 బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచారు.పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి చేసేందుకు 150 మంది సాధారణ సిబ్బందితో పాటు 10మంది అదనపు సిబ్బందిని,మొత్తం 160 మంది ఎన్నికల సిబ్బందిని విధుల కోసం కేటాయించారు.పొదిలి మండలంలో మొత్తం 10ఎంపీటీసీ స్థానాలు ఉండగా, సూదపగుంట,మల్లవరం గ్రామాల ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది.అలాగే మండల వ్యాప్తంగా ఉన్న జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓటర్లు అందరూ నిర్భయంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడు పోలింగ్

కొనకనమిట్ల, నవంబర్4 ప్రభాతవార్త

కొనకనమిట్ల మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలకు గురువారం జరిగే ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు గోపాల్‌సింగ్,ఈశ్వరమ్మలు తెలిపారు. ఎదురాళ్లపాడు ఎంపీటీసీ (టిడిపి)స్థానం ఏకగ్రీవం 13 ఎంపీటీసీ స్థానాలకు, జడ్పిటిసి కి ఎన్నికల పోలింగ్ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన సామగ్రి పంపిణీ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడారు. 54 పోలింగ్ కేంద్రాలకు పిఓ, ఏపీవో,ఓపిఓలు వెరసి 324 మందిని పోలింగ్ విధులను నిర్వహించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జోనల్ ఆఫీసర్లుగా ఎంఈఓ డాంగే షరీఫ్, ఏవో కే ప్రకాష్‌రావు, పిఆర్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డిలు వ్యవహరిస్తారు. ఏడు రూట్ల లోఏడుగురు అధికారులను కేటాయించినట్లు చెప్పారు.మొత్తం మండలంలో 38,655 ఓటర్లు ఓటుహక్కును వినియోగించు కోనున్నట్లు వారు తెలిపారు. బస్సులలో బ్యాలెట్ బాక్స్‌లను సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు.

జడ్పిటిసి ఎన్నికలకు సర్వం సిద్ధం

- రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరెడ్డి

పామూరు, నవంబర్ 4, ప్రభాతవార్త

పామూరు మండలంలో గురువారం నాడు జరగనున్న జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పోలింగ్ ఆఫీసర్లకు అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు బుధవారం నాడు ఎలక్షన్లలో తీసుకోవలసిన విధివిధానాల గురించి తాసిల్దార్ ఆనాటి లక్ష్మీనారాయణ,ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యతో డిప్యూటీ ఎంపీడీవో షేక్ హజరత్ అలీ కలిసి వివరించారు. మండలంలో గల 75 పోలింగ్ బూతులకు 300 మందిని ఎన్నికల అధికారులుగా నియమించామన్నారు. పోలింగ్ ఆఫీసర్స్‌గా 75మంది సహాయ పోలింగ్ అధికారులుగా 75మంది ఓపీలు ప్రతి బూతుకు ఇద్దరినీ కేటాయించామన్నారు. 800ఓటింగ్ దాటితే ప్రతి బూత్‌కి ఒకరినీ అదనంగా పోలింగ్ విధులకు నియమించడం జరిగిందని వారు తెలిపారు. కాగా పోలింగ్‌కు అవసరమైన సామాగ్రి బాక్సులు ఇతర పరికరాలను సిబ్బందికి అందజేసి ఆర్టీసీ బస్సుల ద్వారా వివిధ రూట్లలో గల పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సమస్యాత్మక గ్రామంలో ప్రత్యేక పోలింగ్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తాసిల్దార్ ఆనాటి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో బ్రహ్మయ్యలు తెలిపారు.

జడ్పిటిసి ఎన్నికలకు 63 బూతులకు 252 మంది సిబ్బంది

- ప్రత్యేక పరిశీలకులు 32 మంది

- సమస్యాత్మక పోలీంగ్ కేంద్రాలకు 12 మంది

- అధిక సమస్యాత్మక కేంద్రాలకు ఇద్దరు

- అతి సమస్యాత్మక కేంద్రాలకు ఐదుగురు

యర్రగొండపాలెం, నవంబర్ 3, ప్రభాతవార్త

యర్రగొండపాలెం మండలం జడ్పిటీసీ ఎన్నికల సందర్భంగా ఒక్కో బూతుకు నలుగురుగురు సిబ్బంది చొప్పున 63 భూతులకు 252 మంది సిబ్బందిని నియమించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎన్నికలు సమర్థవంతంగా సమన్వయంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమస్యత్మకమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి 12 మంది అధికారులను నియమించామని అదేవిధంగా ఎక్కువ సమస్యాత్మక గ్రామాలకు ఇద్దరిని. అత్యధిక సమస్యాత్మక గ్రామాలకు 5గురిని మండలంలోని పలు గ్రామాలకు 6రూటు మ్యాపులను తయారుచేసి 6బస్సులను కేటాయించి సిబ్బందిని తరలించినట్లు అధికారి తెలిపారు. నలమల ఆటవీ ప్రాంతంలోని పాలుట్లకు ప్రత్యేక వాహనం ఎర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరు వారి ఓటు హక్కును స్వేచ్ఛయుత వాతావరణంలో వినియెగించుకొనే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందకు అందరు సహకరించాలని, ఎటువంటి వివాదాస్పద సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గతంలో జరిగిన విషాయాలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికలకు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు

- ఎస్సై కట్టా అనూక్

పామూరు, నవంబర్ 4, ప్రభాతవార్త

బుధవారం నాడు జరగనున్న పామూరు మండల జెడ్పిటిసి ఎన్నికలకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై కట్టా అనూక్ తెలిపారు. బుధవారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే సిబ్బందికి తను సూచనలు సలహాలు తెలియజేశారు. పట్టణంలో పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. మండలంలోని ఏడు రూట్‌లకు సంబంధించి 40 మంది పోలీసులను నియమించామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలను అతిక్రమించి బూతులు వద్ద అల్లర్లకు గొడవలకు పాల్పడితే పోలీసు వారు తీసుకునే కఠిన చర్యలకు బాధ్యత వహించవలసి వస్తుందని ఎస్సై కట్ట అనూక్ హెచ్చరించారు. పోలింగ్ స్టేషన్లో వద్ద విధులు నిర్వహించే వారితో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ఎటువంటి వివాదాలకు ఘర్షణకు తావు లేకుండా చూస్తామన్నారు. మారణాయుధాలు, కర్రలు, కత్తులు కలిగి ఉన్న మద్యం సేవించిఓటర్లతో కవ్వింపు చర్యలకు పాల్పడినారోడీ షీట్‌ఓపెన్ చేసిజైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

ong-8_ong-8.qxd 11/4/2026 11:05 PM Page 1

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు

జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు

- 2,391 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు
- ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం చర్యలు తప్పవు

ఒంగోలు, ప్రభాతవార్త

నేడు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని బుధవారం జిల్లా ఎస్పీ తెలియజేశారు. జిల్లాలో 25 జడ్పీటీసీ, 220 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 714 పోలింగ్ లొకేషన్లలో 1,260 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో 83 అత్యంత సమస్యాత్మక, 149 సమస్యాత్మక, 482 సాధారణ పోలింగ్ లొకేషన్లుగా గుర్తించి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 2,391 మంది పోలీసు, ఇతర శాఖల సిబ్బందిని నియమించారు. అదనంగా 34 స్ట్రైకింగ్ ఫోర్స్, ఏఎస్పీ 2, డీఎస్పీ 6, సీఐ 26 లు స్ట్రైకింగ్ ఫోర్స్, 25 సీఐల ప్రత్యేక ఫోర్స్ ఏర్పాటు చేశారు. అలాగే 141 రూట్ మొబైల్ వాహనాలను ఒంగోలు (53), దర్శి (57), కందుకూరు (31) ప్రాంతాల్లో అందుబాటులో ఉంచారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 739 మంది చెడు నడతగల వ్యక్తుల(రౌడీషీటర్ల)పై బైండోవర్, గొడవలు, అల్లర్లకు చేస్తారనే ఉద్దేశ్యంతో ముందస్తుగా 974 మందిని బైండ్ ఓవర్ చేయటం జరిగింది. ఎన్నికల నియమాలను ఉల్లంఘించి 23 కేసులు, అక్రమ మద్యం స్వాధీనానికి సంబంధించి 48 కేసుల్లో 187.37 లీటర్ల మద్యం, రూ.2,80,300 నగదును 13 కేసుల్లో స్వాధీనం చేసుకున్నారు. డిస్ట్రిబ్యూషను సెంటరు నుండి పోలింగ్ మెటీరియల్ తీసుకొని వెళ్ళే దగ్గర నుండి పోలింగు ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్సులను సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద పక్కా ప్రణాళికతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. పోలింగ్ సెంటర్ నిర్ణీత మార్గాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ పరిస్థితులను పర్యవేక్షించేందుకు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి శాంతిభద్రతలను అదుపులోకి తీసుకునేందుకు రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు,స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్స్‌తో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు, కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పటు చేసి తగిన భద్రతను కూడా ఏర్పాటు చేయడమైంది. ఈ ఫోర్స్ మొత్తం సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుంది. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎన్నికల సమయంలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పకట్బంది ఏర్పాట్లు చేసేమని, అలాగే ఏవైనా సంఘటనలు జరిగే అవకాశమున్నా జరుగుచున్నట్లు తెలిసిన వెంటనే డయల్ -100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266 కు సమాచారం అందించి సహకరించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ తెలిపారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

బల్లికురవ, నవంబర్ 4, ప్రభాతవార్త

మండలంలో ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి వరలక్ష్మీ, ఎంపీడీవో కుసుమకుమారి, తాసిల్దార్ రవి నాయక్‌లు తెలిపారు. ఇరువురు జోనల్ అధికారులతో సహా 300 మంది సిబ్బంది ఎన్నికల విధులకు హాజరవుతారని వారు వివరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 70 మంది పోలీసు సిబ్బంది విధులలో పాల్గొననున్నారని ఎస్సై నాగరాజు తెలియజేశారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు ప్రజలంతా తమ వంతు సహకారం అందజేయాలని అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలలో సీసీటీవీ ల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. తుఫాను ప్రభావం కారణంగా రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎన్నికల విధులకు కొంతమేర ఆటంకం కలుగుతుంది.

తుఫాను కారణంగా ఫౌండ్రి వ్యాపారులకు భారీ నష్టం

బల్లికురవ, నవంబర్ 4, ప్రభాతవార్త

తుఫాను ప్రభావం కారణంగా పౌల్ట్రీ వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. సంత మాగులూరు మండలం కొప్పరం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న పౌల్ట్రీ ఫామ్ లో 35 వేల కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి. నూతన షెడ్ల నిర్మాణం కోసం తీసుకువచ్చిన 500 బస్తాల సిమెంటు ఎందుకు పనికిరాకుండా పోయింది. మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో చెందిన బుర్రి ఏడుకొండలు కు చెందిన పౌల్ట్రీ ఫార్మ్ పూర్తిగా నేలమట్టమయింది. రూ 15 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు కన్నీటి పర్యంతం అవుతున్నాడు. బోరు బావులు కింద సాగుచేసిన వరి పంట నేల కరిచింది. బొప్పాయి, అరటి తోటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఉలవపాడు, నవంబర్ 4, ప్రభాతవార్త

నేడు జరగనున్న జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. మొత్తం 51 పోలింగ్ కేంద్రాల్లో మండల ప్రజలుఓటు హక్కు వినియోగించుకోనున్నారు.మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలుఉండగా రెండు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 15 స్థానాలలో జడ్పిటిసి ఎన్నికలు జరగనుండగా 13స్థానాలలో ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నాయని ఆరో సురేష్‌నాయుడు తెలిపారు.

ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు: సిఐ శేషగిరిరావు

సంతమాగులూరు, నవంబర్ 4, ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సంతమాగులూరు సర్కిల్ పరిధిలో పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ పర్యవేక్షణలో సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సంతమాగులూరు సీఐ పి. శేషగిరిరావు తెలిపారు. రెండు మండలాల పరిధిలోని 118 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సీఐ వివరించారు. వీరిలో 40 మంది మహిళా పోలీసులు, నలుగురు ఎస్సైలు, 30 మంది స్థానిక పోలీసు సిబ్బందితోపాటు అదనపు బలగాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు మొబైల్ పార్టీలను రంగంలోకి దించినట్లు సీఐ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం పర్యటిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తాయని చెప్పారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు సమాచారం అందితే నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ పర్యవేక్షణలో రెండు మండలాల్లో పోలీసు బందోబస్తు కొనసాగుతుందని సీఐ తెలిపారు. సంతమాగులూరు ఎస్సై ఆవుల బాలకృష్ణ, బల్లికురవ ఎస్సై నాగరాజు తమ పరిధిలోని పోలీసు సిబ్బందితో కలిసి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

వైస్ చైర్మన్ రేసులో పలువురు

- అధిష్టానం దృష్టికి అభ్యర్థనలు

అద్దంకి, నవంబరు 4, ప్రభాతవార్త :

అద్దంకి మున్సిపల్ ఎన్నికలలో భాగంగా చైర్మన్, కౌన్సిలర్‌ల ఎన్నిక పక్రియ ముగిసింది. అయితే ప్రధానంగా అద్దంకి మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ పదవిని పలువురు ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. అద్దంకిలో అటు మేజర్ పంచాయతీ, ఇటు నగర పంచాయతీ, మున్సిపాలిటీగా పాలకమండలి ఎన్నికల అనంతరం ఆనవాతీగా ఉప సర్పంచ్‌లుగాని, వైస్ చైర్మన్‌లుగాని ఆర్యవైశ్యులకే దాదాపుగా ఈ పదవి లభిస్తుంది. నర్రా శ్రీరామమూర్తి, విజయలక్ష్మి, సందిరెడ్డి శ్రీనివాసరావు, చెన్నుపల్లి వెంకటేశ్వర్లులు సర్పంచ్‌లుగా పనిచేసిన కాలంలో ఉపసర్పంచ్‌లుగా ఆర్యవైశ్యులే పనిచేశారు. దయమణి, ఏస్తేర్‌రాణిలు మున్సిపల్ చైర్మన్‌లు వున్న సమయంలో కూడ వైస్ చైర్మన్‌లు ఆర్యవైశ్యులు వున్నారు. అయితే వైసిపి ప్రభుత్వం ఇరువురికి వైఎస్ చైర్మన్ పదవులు కల్పించిన నేపద్యంలో ఒకటి ఆర్యవైశ్యులకు, రెండవది యాదవ్ సామాజిక వర్గం వారికి దక్కింది. అయితే తాజాగా ప్రస్తుతం జరిగిన ఎన్నికలలో వైస్ చైర్మన్‌గా ఒకరినే ఎన్నుకొనే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. తదనుగుణంగా అద్దంకి మున్సిపల్ పాలిటీ వైస్ చైర్మన్ ఆనవాతీగా ఆర్యవైశ్యులకు కేటాయించాలని, ఇప్పటికే పలు అభ్యర్థనలు వున్నాయి. ఈ పరిస్థితిలలో 19వ వార్డునుండి చిన్ని మారస హనుమా, 579 అత్యధిక ఓట్ల అధిక్యంతో ఘన విజయం సాధించింది. వైఎస్ చైర్మన్ పదవి కొరకు తమ ప్రయత్నాల్లో వున్నట్లు సమాచారం. పట్టణంలో వీరికి అత్యధిక బంధుగణం వుండటం మొదటి నుండి తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ వుండటం, గతంలో హనుమా తండ్రి చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, దయామణి చైర్మన్‌గా వున్న సమయంలో వైఎస్ చైర్మన్‌గా పనిచేయడంతో ఈ వైస్ చైర్మన్ పదవిని మానస హనుమా అశిస్తున్నారు. ఇది ఇలా వుండగా 20వ వార్డునుండి రంగిశెట్టి సాంబశివరావు ఇప్పటికే నాలుగు పర్యాయాలు వార్డు సభ్యుడుగా విజయం సాధించడం, మేజర్ పంచాయతీ సమయంలో ఒక సారి, మున్సిపాలిటీ మూడు పర్యాయాలు కౌన్సిలర్‌గా విజయం సాధించాడు. కాపు సామాజిక వర్గానికి చెందిన రంగిశెట్టి సాంబశివరావు దీర్ఘకాలికంగా తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ మంచి కార్యకర్తగా, వర్కర్‌గా, పట్టణ ప్రజలకు సుపరిచితుడు. తన కాపు సామాజిక వర్గంతోపాటు, ఆర్యవైశ్యులతో మమేకమై వుండటమే కాక, పట్టణంలోని ప్రతి ఒక్కరికి తలలో నాలుకగా, అనుకువగా నడుచుకుంటూడనే పేరు సంపాదించుకున్నాడు. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా, అందరి వాడిగా లహరి పట్టణంలో గుర్తింపుపొందాడు. ఇక 8వ వార్డునుండి 158 ఓట్లతో విజయం సాధించిన రామిశెట్టి శ్రీదేవి కూడ వైఎస్ చైర్మన్ పదవిని అశిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో టిడిపి నుండి అద్దంకి పట్టణంలో ఎంపిటిసిగా కూడ ఈమె పోటీ చేశారు. దీర్ఘకాలికంగా తెలుగుదేశంలోనే క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇప్పటికే ఈ పదవి ని అశిస్తున్న పలువురుకౌన్సిలర్‌లు తమ తమ అభ్యర్థనలను, వారి శ్రేయోభిలాషుల ద్వారా, ముఖ్య నేతల ద్వారా, అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళె పనిలో నిమగ్నమైయి వున్నారు. ఏది ఏమైనా వైఎస్ చైర్మన్ ఎంపిక విషయంలో అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో వేచిచూద్దాం.

17వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి ఘనవిజయం

- అద్దంకి, నవంబరు 4, ప్రభాతవార్త :

అద్దంకి మున్సిపల్ ఎన్నికలలో ఒక అరుదైన సంఘటన చోటు చేసుకుంది. 17వ వార్డులో అటు అధికారపక్షం, ఇటు ప్రతిపక్షం తమ తమ అభ్యర్థులను కౌన్సిలర్‌లుగా పోటీకి దించారు. అయితే టిడిపిలో చురుకైన కార్యకర్తగా పని చేస్తున్న నర్రా రవీంద్రనాథ్ తనకు కౌన్సిలర్‌గా పోటీచేసే అవకాశం కల్పించాలని టిడిపి నాయకత్వాన్ని అభ్యర్థించారు. అయితే కారణాలు ఏమైనా రవీంద్రనాథ్‌కు టిడిపి అభ్యర్థిత్వం దక్కలేదు. ఈనేపద్యంలో రవీంద్రనాథ్ తన సతీమణి నర్రా విమలను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి దించారు. అటు అధికార పక్షమైన టిడిపి, ఇటు ప్రతిపక్షమైన వైసిపిలను పోటీలో ఎదుర్కుకొన్ని నర్రా విమల నరేంద్రనాథ్ 209 ఓట్లతో గెలుపొందారు. దీంతో 17వ వార్డులో అటు అధికార పక్షం, ప్రతిపక్షం అభ్యర్థులకు స్వతంత్ర అభ్యర్థి ప్రభావంతో ఓటమి తప్పలేదు.

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కు పలువురు అభినందనలు

అద్దంకి, నవంబరు 4, ప్రభాతవార్త

అద్దంకి మున్సిపల్ చైర్మన్ కాకాని అశోక్‌కి పలువురు అభినందనలు తెలిపారు. వీరిలో నియోజవర్గ పరిశీలకులు మద్దిరాల గంగాధర్, వ్యవసాయ శాఖ మిషన్ సంచాలకు నాగినేని రామకృష్ణ తదితరులు వున్నారు.

మురసు తుఫాన్ ప్రభావిత ఉద్యాన తోటల్లో క్షేత్ర పరిశీలన

దర్శి, నవంబర్ 4, ప్రభాతవార్త

దర్శి మండలంలోని బసిరెడ్డిపల్లి, వెంకటాచలం పల్లి, చలివేంద్రం గ్రామాల నందు మిరప సాగు చేసిన పంటలను శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఠాగూర్ నాయక్, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన స్థానం, దర్శి ఉద్యాన అధికారి ఎం.రవివెంకన్న బాబు కలిసి తుఫాన్ ప్రభావిత మిరప పంటలో క్షేత్ర సందర్శనలు చేసి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అదే విధంగా మిరపలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, తెగుళ్ల యాజమాన్యం, పురుగు మందుల పిచికారి విధానాలు, కాయకోత అనంతరం యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న పాలాలను సందర్శించిన వ్యవసాయాధికారులు

ముండ్లమూరు, నవంబర్ 4, ప్రభాతవార్త

ముండ్లమూరు మండలం ముండ్లమూరు, వేంపాడు గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి, ఆచార్య ఎన్.జి రంగా విశ్వవిద్యాలయం వారు రాష్ట్ర వ్యవసాయ విభాగం వారితో కలిసి మురసు తుఫాను పంట పొలాల నష్టంపై పొలాల సందర్శనలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సీనియర్ శాస్త్రవేత్త డా. జి.రమేష్, డా.టి. వెంకటేశ్వరరెడ్డి, డా. టి.మానస మురసు తుఫాన్ ప్రభావంతో భారీ గాలులతో, అత్యధిక వర్షపాతం నమోదు అయింది అని, దానితో వరి, మిరప, వరిలో మురుగు నీటిని బయటకు పంపి, నీరు ఆరిన తరువాత కలుపు అవకాశం ఉంది. కాబట్టి కంకి నల్లికి ప్రొఫెనోఫాస్ 400 మి.లీ, గింజ మరియు ఆకు మచ్చకు ట్రైప్లాక్సిస్ట్రాబిన్ + టెబుకొనజోల్ 100 గ్రా/ ఎకరాకు పిచికారి చేయాలని అని, మిరపలో ఉన్నకాయలను కోసి, బ్లైటాక్స్ 600 గ్రా, 200 లీటర్ల నీటిలో కలుపుకుని మొక్కల మొదట్లో పోసుకోవాలని, తరువాత వెంటనే బోదెలు వేసుకోవాలని, మొక్కజొన్న త్వరగా కోత కోసి వాటిని ఆరబెట్టుకోవాల అని తగిన జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు మండల వ్యవసాయాధికారి తిరుమలరావు, ఏఏఏ, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి

సంతమాగులూరు, నవంబర్ 4,ప్రభాతవార్త

మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మండలంలోని 17 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 60 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎన్నికల సిబ్బందికి బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు పంపిణీ చేశామని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశామని, పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 17 ఎంపీటీసీ స్థానాలకు 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, జడ్పీటీసీ స్థానానికి టీడీపీ నుంచి ఆలూరి శ్రీవల్లి, వైసీపీ నుంచి గడ్డం సుజాత పోటీ చేస్తున్నట్లు తెలిపారు.ఓటర్లు ఎలాంటి సందేహాలు, భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. సంతమాగులూరు సీఐ పి.శేషగిరిరావు, తహసీల్దార్ కే. రవిబాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, డిప్యూటీ తహసీల్దార్ రాఘవరావు, ఉప మండల అభివృద్ధి అధికారి శివరాం ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీలో నిర్లక్ష్యం..

- ఓటర్లలో అయోమయం..! - పాత బూత్ నెంబర్లతో స్లిప్పుల పంపిణీ..

- ఓటు ఎక్కడ వేయాలో తెలియక ఓటర్ల ఇబ్బందులు

వేటపాలెం, నవంబర్ 4, ప్రభాతవార్త

ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల నేపథ్యంలో వేటపాలెం మండలంలో ఓటరు స్లిప్పుల పంపిణీలో తీవ్ర జాప్యం, గందరగోళం నెలకొంది. ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఓటరు స్లిప్పులను బీఎల్ఓలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడం లేదని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అరకొరగా స్లిప్పులు పంపిణీ చేస్తున్నప్పటికీ, వాటిలో పాత పోలింగ్ బూత్ నెంబర్లు ఉండటంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నప్పటికీ ప్రతి ఓటరుకు స్లిప్పులు అందించాల్సిన బాధ్యతను సంబంధిత అధికారులు సక్రమంగా నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమందికి స్లిప్పులు అందకపోగా, అందిన స్లిప్‌లో పాత బూత్ నెంబర్లతో కూడిన స్లిప్పులు అందుతున్నాయి. దీంతో తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియక ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, కొత్తగా ఓటు హక్కు పొందిన వారు పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవడానికి అవస్థలు పడుతున్నారు. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల వద్ద గందరగోళం తలెత్తే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీటీసీ ఎన్నికలు సర్వసిద్ధం గట్టి బందోబస్తీతో నిర్వహణ

జె. పంగులూరు, నవంబర్ 4, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కావల సిన సామాగ్రి ఏర్పాట్లు అన్ని సిద్ధం చేసినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి జి. శ్రీనివాసరావు, ఎం.సి.సి అధికారి తాసిల్దార్ సింగారావు, ఎంపీడీవో కె.స్వరూపారాణి సంయుక్తంగా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ అధికారి జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 48 గాను 240 మంది సిబ్బందిని, మైక్రో అబ్రవేజర్స్ పందొమ్మిది మంది, రూట్ ఆఫీసర్స్ ఏడుగురు, జోనల్ ఆఫీసర్స్ ముగ్గురు, ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికలు సజావుగా నిర్వహణ జరుగుటకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని సిఐ రమేష్, మల్లికార్జున్ తెలిపారు. ఎస్సైలు ఇద్దరూ సిబ్బంది 70 మందిని స్పెషల్ కార్డు 15 మందిని ఏర్పాటు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తీతో ఎన్నికలు జరుగుతాయని సివలు తెలిపారు.

అద్దంకి మున్సిపాలిటీలో కూటమి ఘన విజయం

- చైర్మన్‌గా కాకాని అశోక్ 7,500తో భారీ విజయం

- కూటమికి 29, వైసిపి 2, స్వతంత్ర అభ్యర్థి 1

- 23న పాలకమండలి ప్రమాణ స్వీకారం

అద్దంకి, నవంబరు 4, ప్రభాతవార్త :

మున్సిపల్ ఎన్నికలలో అద్దంకి మున్సిపాలిటీని కూటమి కైవసం చేసుకుంది. చైర్మన్‌గా కూటమి టిడిపికి చెందిన కాకాని అశోక్ 7,493 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 32 వార్డులకు గాను, 1,6,32 వార్డులను టిడిపి ఏకగ్రీవంగా దక్కించు కోగ, 3,4,5,7,8,9,11,12,13,14, 15,16,18, 19,20,22, 23,24,25,26,29,31 వార్డులను టిడిపి కైవసం చేసుకోగ, 10,21,27,30 వార్డులను జనసేన కైవసం చేసుకుంది. 2,28,వార్డులను వైసిపి గెలుచుకోగ, 17వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి 209ఓట్ల అధిక్యతతో గెలుపొందారు.ఈ నూతన పాలకమండలి ఈనెల 23న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

అద్దంకి మున్సిపల్ ఎన్నికలలో ప్రజాస్వామ్యం ఖూనీ

- డాక్టర్ అశోక్ కుమార్

అద్దంకి, నవంబరు 4, ప్రభాతవార్త :

అద్దంకి మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి కౌంటింగ్ ముగిసే వరకు అధికార టీడీపీ నాయకులు, పోలీసులు అవలంబించిన ఏకపక్ష విధానాలు, అరాచకాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలను ప్రజల ముందుంచేందుకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మున్సిపల్ ఎన్నికల తీరుతెన్నులను ఎండగట్టారు.నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే, కేవలం 8,000 రూపాయల చిన్న అకౌంట్ వ్యత్యాసాన్ని సాకుగా చూపి తమ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారు అని అన్నారు.ప్రతిపక్షాల నుంచి స్పష్టమైన ఆధారాలు చూపినప్పటికీ, పోలింగ్ అధికారులు వాటిని పట్టించుకోకుండా ఏకపక్షంగా ఏకగ్రీవాలకు ఆమోదం తెలిపారు.అభ్యర్థితో సంబంధం లేకుండా, నామినేషన్ వేసిన ప్రపోజర్‌తో బలవంతంగా సంతకం చేయించి ఎలాంటి అధికారిక అండర్‌టేకింగ్ లెటర్ లేకుండానే నామినేషన్లు విత్‌డ్రా చేయించుకున్నారు. దీనికి అధికారులు మౌనంగా సహకరించారు అన్నారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, అధికార పార్టీకి కొమ్ముకాసిన ఆ పోలింగ్ అధికారులు, సిబ్బందిపై రానున్న రోజుల్లో న్యాయపరమైన చర్యలు, ప్రైవేట్ కేసులు వేయనున్నట్లు హెచ్చరించారు.పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్న తనను సైతం ఇక్కడ ఉండటానికి వీల్లేదు అని అనడంతో, వ్యవస్థపై గౌరవంతో మర్యాదపూర్వకంగా బయటికి వెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే, మంత్రి గొట్టిపాటి రవికుమార్ పీఏలు పోలింగ్ బూతుల్లోకి వచ్చి అధికారులను, ప్రజలను బెదిరించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. దొనకొండ నుంచి వచ్చిన ఒక ఎస్ఐ విలేకరులు అని కూడా చూడకుండా బూతులు తిట్టారని, అభ్యర్థులు, ఏజెంట్లు అని చూడకుండా లాఠీలతో కాళ్ల మీద కొట్టి బయటికి ఈడ్చిపడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క గ్రామాల నుంచి దొంగ ఓటర్లను రప్పించి, బూతుల్లోకి దూరి ఏజెంట్లను బయటికి గెం